

ధర్మానను కలిసిన దువ్వాడ వాణి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును టెక్కలి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి పెద్దపాడులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. టెక్కలి అభ్యర్థిగా వాణి పేరును అధిష్టానం ప్రకటించిన నేపథ్యంలో ఆమెకు ధర్మాన శుభాకాంక్షలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. సంక్షేమం, అభివృద్ధి పథకాల లబ్ధిదారులను తెలుసుకుంటూ వాటి అమలు తీరుపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రగతిని ప్రజలకు చేరువ చేయాలన్నారు. ధర్మానను కలిసిన వారిలో టెక్కలి ఎంపిపి సరోజిని, వాణి తండ్రి మాజీ ఎంపిపి సంపతిరావు రాఘవరావు, కుమార్తె దువ్వాడ హైందవి, అల్లుడు మోహన్, గురుగుబెల్లి లోకనాథం తదితరులున్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే...

సంక్షోభంలో చేనేత రంగం

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - లావేరు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్లే చేనేత రంగం సంక్షోభంలోకి నెట్టబడిందని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వి రమణ విమర్శించారు. లావేరులో చేనేత కార్మికుల స్థితిగతులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక చేనేత కార్మికులకు ప్రమాద బీమా, స్కాలర్‌షిప్ సౌకర్యాన్ని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేతపై 20 శాతం జిఎస్‌టి విధించడం వల్ల మగ్గాలు మూతపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత పరిశ్రమకు రిజర్వ్ చేసిన 11 రకాల చేనేత వస్త్రాలను పవర్ లూమ్ ద్వారా నేయడం వల్ల చేనేత కార్మికులకు పనుల్లేక వలస పోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. చేనేత కార్మికులకు భారాలు వేసి, పవర్ లూమ్‌లకు రాయితీలు ఇస్తోందని విమర్శించారు.

రాష్ట్ర ప్రభుత్వం 45 ఏళ్లు దాటిన చేనేత కార్మికులకు పెన్షన్, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, మూడు సెంట్ల స్థలంలో మగ్గం షెడ్‌తో కూడిన ఇల్లు నిర్మిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినా, నేటికీ వాటిని అమలు చేయడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో రెండు లక్షల మగ్గాలు ఉన్నాయని, వీటిపై తొమ్మిది ఉప వృత్తుల్లో సుమారు ఆరు లక్షల మంది పనిచేస్తున్నారని చెప్పారు. కేవలం 81 వేల మందికే నేతన్న నేస్తం పథకం అందిస్తున్నారని విమర్శించారు. జిల్లాలో సుమారు ఐదు వేల కుటుంబాలు చేనేత పని చేస్తుంటే, 1308 మంది మాత్రమే నేతన్న నేస్తానికి అర్హులుగా గుర్తించారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత సహకార సంఘాలకు ఇవ్వాల్సిన నూలు సబ్సిడీ, త్రిఫ్ట్ ఫండ్ రూ.80 కోట్లు జమ చేయకపోవడంతో అనేక సహకార సంఘాలు మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో 15 సహకార సంఘాలు మూతపడ్డాయని తెలిపారు. స్కూల్ పిల్లలకు చేనేత వస్త్రాలు కొనుగోలు చేయకుండా పవర్‌లూమ్ వస్త్రాలు కొనుగోలు చేయడంతో చేనేత కార్మికులకు పనుల్లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిఎస్‌టిని రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, 11 రకాల చేనేత వస్త్రాలను చేనేత కార్మికులతోనే చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ఎం.గోరీశంకర్, నాయకులు ఎల్.రాంబాబు, ఎ.ఈశ్వరరావు, కె.వెంకటరావు, ఇ.సత్తిబాబు, కె.శ్రీనివాసరావు, కె.కమల, కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.



చేనేత వస్త్ర తయారీని పరిశీలిస్తున్న గోవిందరావు, రమణ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వద్దు

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- నిధులకు లోటు లేదు
- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వద్దని విద్యాశాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. జిల్లాలో చేపడుతున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. గడప గడపకూ మన ప్రభుత్వం, నాడు-నేడు, ఉపాధి హామీ తదితర వాటి అమలు తీరుపై ఆరా తీశారు. పనులు చేపట్టడంలో సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పనుల నిర్వహణకు సామగ్రి అందుబాటులో ఉన్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో చేపడుతున్న గడప గడపకూ మన ప్రభుత్వం మంజూరు చేసిన పనులు, వాటికి సంబంధించిన బిల్లుల చెల్లింపుల వివరాలను సిపిఒ లక్ష్మీప్రసన్నను అడిగి తెలుసుకున్నారు. చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు అప్‌లోడ్ చేయకపోవడమేమిటని ప్రశ్నించారు. బిల్లులు అప్‌లోడ్ వేగవంతం చేయాలన్నారు. శ్రీకాకుళం నగరంలో చేపడుతున్న గడప గడపకు మన ప్రభుత్వం పనుల పరిస్థితి ఏమిటని అడిగారు. శ్రీకాకుళం-ఆమదాలవలస రహదారి విస్తరణ పనులు ఎంతవరకు వచ్చాయని ఆర్‌అండ్‌బి అధికారులను అడిగారు. ఇప్పటివరకు చేపట్టిన పనులను అధికారులు వివరించారు. ఉపాధి హామీ నిధులతో వారంలో చేసిన పనులకు సంబంధించి నివేదిక ఇవ్వాలని డ్వామా పీడీ, పంచాయతీరాజ్‌శాఖ ఎస్ఇని ఆదేశించారు. వచ్చే నెల ఏడో తేదీన నిర్వహించనున్న డిఆర్‌సి సమావేశానికి పనులు సిద్ధం కావాలని చెప్పారు. సమావేశంలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, అంధవరపు సూరిబాబు, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, గొర్లె కిరణ్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్‌డిఒలు బి.శాంతి, సీతారామ్మూర్తి, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్ పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు వస్తుంటే ఏం చేస్తున్నారు?

సచివాలయ ఉద్యోగులపై మంత్రి అప్పలరాజు ఆగ్రహం

ప్రజాశక్తి - పలాస

వార్డులో పర్యటిస్తుంటే ఫిర్యాదులు వస్తున్నాయని, ఏం పనిచేస్తున్నారని రాష్ట్ర పశు సంవర్థకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు సచివాలయ ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలాస - కాశీబుగ్గ మున్సిపాల్టీ పరిధిలోని 20వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై ఆరా తీస్తున్న సమయంలో లేబర్ కాలనీకి చెందిన కోల భాసుపతి ఇద్దరు పిల్లలు నేస్తం పథకం రావడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అదే ప్రాంతానికి చెందిన పుక్కళ్ల దేవరాజు తన కాలికి శస్త్రచికిత్స చేయాల్సి ఉందని, ఆరోగ్యశ్రీ కార్డు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మంత్రి సచివాలయ ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగేళ్లుగా ఏం పనిచేస్తున్నారని, ప్రజల సమస్యలు ఎందుకు పరిష్కరించడం లేదని మండిపడ్డారు. ప్రజలకు సేవలు అందించడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. తక్షణమే ఫిర్యాదు చేసిన లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆరోగ్యశ్రీ కార్డు లేకపోయినా ఆపరేషన్ చేయిస్తానని దేవరాజుకు మంత్రి హామీనిచ్చారు. కార్యక్రమంలో పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఎంపిపి చైర్మన్ పి.వి సతీష్, పలాస పిఎసిఎస్ అధ్యక్షుడు మల్లా సురేష్ కుమార్, పలాస ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీ శంకర్, తహశీల్దార్ ఎల్.మధుసూదనరావు, మున్సిపల్ ఆర్‌ఒ అప్పలస్వామి, కౌన్సిలర్ అంబటి మాధురి, అంబటి ఆనంద్, బమ్మిడి సంతోష్, బల్లయ్య, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అప్పలరాజు

7న డిఆర్‌సి సమావేశం!

శ్రీకాకుళం : జిల్లా సమీక్షా కమిటీ (డిఆర్‌సి) సమావేశం ఈనెల ఏడో తేదీన నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిసింది. కలెక్టరేట్‌లో అభివృద్ధి పనులపై శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశం సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ సూచనప్రాయంగా తేదీన ప్రకటించారు. దీనిపై జెడ్‌పి సిఇఒ త్వరలో ప్రకటన జారీ చేసే అవకాశం ఉంది.



ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎస్‌పి రాధిక

డ్రగ్స్ కేసుల దర్యాప్తు వేగవంతం

ఎస్‌పి జి.ఆర్ రాధిక

శ్రీకాకుళం : పెండింగ్‌లో ఉన్న నార్కొటిక్ డ్రగ్స్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని, నిరంతరం క్షుణ్ణంగా వాహనాల తనిఖీలు నిర్వహించాలన్నారు. మిస్సింగ్ కేసుల్లో వ్యక్తులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, కేసుల దర్యాప్తును త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఆస్తి సంబంధిత నేరాలు, టెంపుల్ నేరాలు, చైన్ స్నాచింగ్స్ నివారణకు గస్తీలను పటిష్టంగా అమలు చేయాలని చెప్పారు. ఎక్కువగా నేరాలను జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, నేరాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. రాత్రి గస్తీలను ముమ్మరంగా అమలు చేయాలని చెప్పారు. నివాస, దుకాణ సముదాయాలు, శివారు ప్రాంతాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలను ప్రజలు వినియోగించేకునేలా అవగాహన కల్పించాలన్నారు. జాతీయ రహదారిపై నో పార్కింగ్ సూచిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రమాద నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.

రోడ్డు భద్రతా నియమాలను అతిక్రమించిన వారిపై జరిమానాలు విధించడంతో పాటు వాహన చోదకులు హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాలన్నారు. మిస్సింగ్ కేసులకు సంబంధించి పలురకాల కోణాల్లో దర్యాప్తు చేయాలని సూచించారు. సైబర్ మోసాలు, నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించి సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ, మిస్సింగ్ కేసులు ఛేదన, పెండింగ్ కేసుల పరిష్కారం, కేసుల రాజీలు, ఎం.వి జరిమానాలు వంటి అంశాల్లో ప్రతిభ కనబరిచిన రెండో పట్టణ సిఐ శ్రీనివాసరావు, కాశీబుగ్గ సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు సత్యనారాయణ, బి.గణేష్, గోవిందరావు, కృష్ణ, విజయ్ కుమార్, బి.సత్యనారాయణ, ఎల్.రామకృష్ణ, ఐ.రాజేష్, అహ్మద్ ఆలీకి ప్రశంసాపత్రాలు అందజేశారు. బదిలీపై వెళ్తున్న పోలీసు కార్యాలయ పరిపాలనా అధికారి ఎం.శివరామరాజుకు ఎస్‌పి దుశ్శాలువతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. సమావేశంలో ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, డిఎస్‌పిలు డి.బాలచంద్రారెడ్డి, వై.శృతి, జి.నాగేశ్వరరెడ్డి, ఎస్.వాసుదేవ్, ఎస్.బాలరాజు, ప్రసాదరావు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

స్పీకర్‌కు 'ఎపి జెఎసి అమరావతి' వినతి

ప్రజాశక్తి - ఆమదాలవలస

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎపి జెఎసి అమరావతి నాయకులు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంను కోరారు. మూడో దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా 'ఉద్యోగుల వేదన చెబుదాం' నినాదంతో స్పీకర్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపి జెఎసి అమరావతి జిల్లా చైర్మన్ కె.శ్రీరాములు మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు, పెన్షనర్లకు పెన్షన్లు చెల్లించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఎలు, పిఆర్‌సి ఎరియర్స్‌ను వెంటనే చెల్లించాలన్నారు. 12వ పే రివిజన్ కమిషన్‌ను వెంటనే నియమించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు కొత్త డిఎలు విడుదల చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందని స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలను తక్షణమే పెంచాలని కోరారు. ఇహెచ్‌ఎస్ ద్వారా నగదు రహిత వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. దీనిపై స్పీకర్ స్పందిస్తూ ఉద్యోగుల ప్రధాన సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, కోశాధికారి జి.ఎల్.ఇ శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.అమర్నాథ్, శ్రీకాకుళం డివిజన్ సహాధ్యక్షులు ఎస్.గణపతి, టెక్కలి డివిజన్ కార్యదర్శి ఆర్.రవి తదితరులున్నారు.



స్పీకర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

'స్పందన' ఫిర్యాదులకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జగనన్నకు చెబుదాం (స్పందన)లో వచ్చిన అర్జీలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆయా ఫిర్యాదులపై కచ్చితమైన సమాచారం అందించాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీస్ అధికారులకు స్పష్టం చేశారు. జగనన్నకు చెబుదాం (స్పందన) ఫిర్యాదుల పరిష్కార చర్యలపై జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో పోలీసు అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్పందనకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారని, అంతే ప్రాధాన్యతతో ఫిర్యాదులు పరిష్కరించాలని ఆదేశించారు. ఎటువంటి ఫిర్యాదు అయినా క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే విచారణ కచ్చితంగా చేయాలని విజిటింగ్ ఫొటోలు, ఎంక్వైరీ నివేదికను సకాలంలో నమోదు చేయాలన్నారు. స్పందనలో రీఓపెన్ అయిన వాటిపై సంబంధిత పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకట్రామన్ మాట్లాడుతూ ప్రతిరోజూ వెబ్‌సైట్‌లో వచ్చే అర్జీలను పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారులు సంతృప్తి కానందునే అర్జీలు రీ ఓపెన్ అవుతున్నాయని తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్‌పి టి.పి విఠలేశ్వర్, డిఎస్‌పిలు డి.బాలచంద్రారెడ్డి, వై.శృతి, జి.నాగేశ్వరరెడ్డి, ఎస్.వాసుదేవ్, ఎస్.బాలరాజు, ప్రసాదరావు, ఈ-ఆఫీస్ జిల్లా మేనేజర్ ఇంద్రశేఖర్, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

'కంటి వెలుగు'లో జిల్లా ప్రథమ స్థానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అంధత్వ నివారణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ కంటి వెలుగు అమల్లో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి తెలిపారు. నగరంలోని దండివీధి సచివాలయం పరిధిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కంటి చూపుతో బాధపడే వారికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 60 ఏళ్లు దాటిన 2.94 లక్షల మందిని గుర్తించి వారికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామన్నారు. అవసరమైన వారికి కంటి చికిత్సలు చేస్తున్నామని చెప్పారు. జిల్లావ్యాప్తంగా 12వేల మందికి శస్త్రచికిత్సలు చేశామని, మరో ఎనిమిది వేల మందికి త్వరలో చేస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా 23 వైద్య బృందాలు కంటి వెలుగుపై సర్వే చేస్తున్నాయని చెప్పారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో 83 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అంధత్వంతో బాధపడే వారికి కావాల్సిన కళ్లద్దాలను ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు మందులు అందిస్తామన్నారు. స్కూల్ హెల్త్ ప్రోగ్రాంలోనూ జిల్లా అగ్రభాగాన ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణాధికారి డాక్టర్ కలిశెట్టి త్రినాథరావు, అప్తాలమిక్ అధికారులు రాజారెడ్డి, బాబూరావు, దండివీధి వార్డు ఇంఛార్జి కర్ణేన హరి, సచివాలయ, వైద్యారోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ మీనాక్షి

డిఎంయుని ఇచ్ఛాపురానికి పొడిగించాలి

ఇచ్ఛాపురం : పలాస నుంచి విశాఖపట్నం డిఎంయు రైలును ఇచ్ఛాపురం వరకు పొడిగించాలని రైల్వే సలహా సంఘం సభ్యులు కె.సూర్యప్రకాశరావు ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మను కోరారు. తనిఖీల్లో భాగంగా ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌కు శనివారం వచ్చిన ఆయనకు వినతిపత్రం అందించారు. ఇచ్ఛాపురం నుంచి విశాఖకు వెళ్లేందుకు ఉదయం రైలు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. పూరీ-అహ్మదాబాద్, పూరీ-యశ్వంత్‌పూర్, పూరీ-చెన్నై రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. దీనివల్ల ఇచ్ఛాపురం పరిసర ప్రాంతాలతో పాటు ఒడిశాలోని చికిటి బ్లాక్ ప్రాంతాల ప్రజలకూ ఉపయోగపడుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల కోసం నిర్మించిన జగనన్న కాలనీకి వెళ్లేందుకు సరైన రహదారి లేదని, సంతపేట వద్ద అండర్‌పాసేజ్‌ను పెంచితే ఆ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. రత్తకన్న వెళ్లే మార్గంలో రైల్వే ఎల్‌సి గేటు వల్ల నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తోటూరు వెళ్లే మార్గంలో అండర్‌పాసేజ్‌ను పెంచితే అనేక గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఖుర్దా డివిజన్ డిఆర్‌ఎం రింకేష్, సీనియర్ రైల్వే అధికారి రవిప్రకాష్ యాదవ్, యూజర్స్ కమిటీ సభ్యులు దొరబాబు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న డిఆర్‌యుసి సభ్యులు

వైసిపిలో కలహాల కాపురం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వైసిపిలో ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆ పార్టీకి కలవరం పుట్టిస్తున్నాయి. సొంత పార్టీలోని కేడరే తిరుగుబావుటా ఎగురవేస్తున్నారు. కొన్నిచోట్ల గుంభనంగా ఉండగా, మరికొన్ని నియోజకవర్గాల్లో శ్రేణులు రోడ్డెక్కుతున్న పరిస్థితి నెలకొంది. ఇటీవల పాతపట్నం, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా ఏకంగా ర్యాలీ చేపట్టారు. టెక్కలిలో ఇంటి పోరుతో నియోజకవర్గ ఇన్‌ఛార్జినే అధిష్టానం మార్చింది. పలాసలోనూ మంత్రి సీదిరి అప్పలరాజుకు వ్యతిరేకంగా అధిష్టానానికి ఫిర్యాదులు చేయడం, మంత్రిని వ్యతిరేకిస్తున్న వారంతా పలు సందర్భాల్లో సమావేశాలు నిర్వహించి వ్యతిరేక గళం విప్పిన పరిస్థితిని చూశాం. ఎచ్చెర్ల, పాతపట్నం నియోజకవర్గాల్లో రెండూ చోట్ల ఒకేరకమైన పరిస్థితులు నెలకొన్నాయి. పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతికి వ్యతిరేకంగా కొత్తూరులో తిరుగుబాటు నాయకులు ర్యాలీ నిర్వహిస్తే, అక్కడకు రెండు రోజుల వ్యవధిలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తీరుపై నిరసన ప్రదర్శన చేపట్టారు. తొలి నుంచీ ఈ రెండు నియోజకవర్గాల్లో అసమ్మతి పోరు కొనసాగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల నుంచి మొదలైన పోరు ఇంతింతై వటుడింతై అన్నట్లు తీవ్ర స్థాయికి చేరింది. జగన్ ముద్దు... ఎమ్మెల్యే వద్దు అంటూ ఆయా నియోజకవర్గాల్లో బ్యానర్లతో ర్యాలీ నిర్వహించారు.

ఎచ్చెర్ల, పాతపట్నం నియోజకవర్గాల్లో నెలకొన్న అసమ్మతి పోరుకు ఒక పరిష్కారం మార్గం చూపాల్సిన పార్టీ పెద్దలే వెనుక ఉండి మరింత రాజేస్తున్నారని అనుచరులు మండిపడుతున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకుని ఇక్కడ నుంచి పోటీ చేసేందుకు పొరుగు జిల్లాకు చెందిన మంత్రి సోదరుడు ఒకరు గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగానే గొర్లెకు పొగబెడుతున్నారని ఎమ్మెల్యే అనుచరులు చెప్తున్నారు.



నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి అంతా బాగానే ఉంటే మళ్లీ కిరణ్‌కుమార్‌కే టిక్కెట్ వచ్చే అవకాశాలున్నాయి. పార్టీలో ఇబ్బందికరమైన పరిస్థితి ఉందని, గొర్లెకు ఇస్తే ఓడిపోతారని సంకేతాలు కల్పించడం ద్వారా కొత్త వారికి టిక్కెట్ ఇచ్చేలా చేయడంలో పొరుగు జిల్లా నాయకులు తమదైన శైలిలో వ్యూహ రచనలు సాగిస్తున్నారని తెలుస్తోంది. పాతపట్నం నియోజవర్గంలోనూ అసమ్మతికి ఆజ్యం పోస్తున్నది పార్టీ పెద్దలేనన్న చర్చ నడుస్తోంది.

పాతపట్నంలో ఎన్నికలకు మరో ఏడాది సమయం ఉన్న నేపథ్యంలో స్థానికత అంశాన్ని తెర పైకి మళ్లీ తెచ్చారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి స్థానికేతరులు కావడంతో ఆమెకు టిక్కెట్ రాకుండా అప్పుడే ప్రయత్నాలు మొదలు పెట్టారు. స్థానికుడే కావాలి, వారసత్వం పోవాలి అంటూ టిక్కెట్ ఆశిస్తున్న నియోజకవర్గానికి చెందిన తులసీ వరప్రసాద్, తేజేశ్వరరావు వంటి నాయకులు పోస్టర్లను వేసి మరీ ప్రచారం చేస్తున్నారు. రెడ్డి శాంతి ఒంటెత్తు పోకడలు, ఏకపక్ష ధోరణులను కొత్తూరు వైస్ ఎంపిపి తులసీ వరప్రసాద్ తొలి నుంచీ గట్టిగా వ్యతిరేకిస్తున్నారు. నియోజకవర్గ, పార్టీపరమైన సమస్యలపై రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును కలుస్తున్నారు. ధర్మాన ప్రధాన అనుచరుడు మామిడి శ్రీకాంత్ ఇటీవల వరకు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. పరామర్శలు, గడప గడపకూ మన ప్రభుత్వం వంటి కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో రెడ్డి శాంతిని కాదంటే, ప్రత్యామ్నాయంగా శ్రీకాంత్ ఉన్నారని అధిష్టానానికి చెప్పేందుకేనన్న చర్చ నియోజకవర్గంలో సాగుతోంది.

టెక్కలి నియోజకవర్గంలో అసమ్మతికి అదనంగా కుటుంబ కలహాలు పార్టీకి ఇబ్బందికరంగా పరిణమించాయి. టెక్కలి నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత నుంచే దువ్వాడ శ్రీనివాస్ తీరును అక్కడి కేడర్ వ్యతిరేకించడం మొదలు పెట్టింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో సీనియర్ నాయకులకు ఎలాంటి పదవులు రానివ్వకుండా దువ్వాడ అడ్డుకున్నారని, తన వారికి పదవులు ఇప్పించుకున్నారని, సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుని ఏళ్ల తరబడి పార్టీ కోసం కష్టపడిన తమను మోసం చేశారన్న ఆవేదన నాయకుల్లో ఇప్పటికీ ఉంది. అవకాశం కోసం వారంతా ఎదురుచూస్తున్న పరిస్థితి ఉంది.

ఇదే సమయంలో దువ్వాడ కుటుంబంలో నెలకొన్న కలహాలు పార్టీకి మరింత చేటు తెచ్చేలా కనిపిస్తున్నాయి. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో ఏకంగా శ్రీనివాస్‌ను ఇన్‌ఛార్జి పదవి తప్పించి సతీమణి వాణికి అప్పగించారు. నియోజకవర్గంలో దువ్వాడను వ్యతిరేకిస్తున్న వారంతా ఇప్పటికే పార్టీకి అంటీముట్టన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. గోరుచుట్టుపై రోకలి పోటు చందంగా దువ్వాడ శ్రీనివాస్‌ను ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి తప్పించడంతో ఆయన అనుయాయులు మనస్తాపానికి గురయ్యారు. టెక్కలి నియోజవర్గంలో ఈ పరిస్థితులు ఎటువైపు దారితీస్తాయోనన్న ఆందోళన కేడర్‌లో నెలకొంది.


మాట్లాడుతున్న మంత్రి ధర్మాన

సమాజ సేవకు ముందుకు రావాలి

రెవెన్యూ మంత్రి ప్రసాదరావు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

సమాజ సేవకు ప్రతిఒక్కరూ సైనికుల పనిచేసేటప్పుడే ప్రశాంతత దొరుకుతుందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. టెక్కలి జిల్లా ఆస్పత్రి ఆవరణంలో సత్య సాయి సేవా సమితి నిర్మాణం చేపట్టిన అన్నదానాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సత్య సాయి సేవ సమితి చేసిన అన్నదాన కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని అన్నారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధిని చూసి టిడిపి నాయకులు ఓర్వలేకపోతున్నారని అన్నారు. ఈ నాలుగేళ్లలో ప్రభుత్వం నాడు-నేడు పనులతో పాఠశాలల్లో కార్పొరేట్ సంస్థలకు ధీటుగా ఏర్పాటు చేస్తున్నామని, విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. సిఎం జగన్ నిష్పక్షపాతంగా భూ సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, జెడ్‌పిటిసి దువ్వాడ వాణి, ఎంపిపి ఆట్ల సరోజనమ్మ, సత్యసాయి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షులు లింగరాజు, ఆస్పత్రి సూపరింటెండెంట్ బొడ్డేపల్లి సూర్యారావు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు జిల్లాలో విజయవంతంగా నిర్వహిస్తున్న సందర్భంగా నగరంలోని కోడిరామ్మూర్తి స్టేడియంలో జిల్లాస్థాయి క్రీడాకారులకు ప్రత్యేక స్పోర్ట్స్ కిట్లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలను జీవనోపాధి మార్గంగా ఎంచుకునేలా విద్యార్థులను ప్రోత్సహించాల్సిన వాతావరణాన్ని నిర్మించాలని సూచించారు. జిల్లాలో 50 ప్రాంతాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. దాదాపు రెండు వేల మంది క్రీడాకారులు పలు క్రీడాంశాల్లో అంతర్జాతీయ స్థాయి తర్ఫీదు పొందుతున్నారని వివరించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రూ. రెండు లక్షల విలువ చేసే కిట్లను పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, చీఫ్ కోచ్ శ్రీధర్, ఒలింపిక్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి సుందరరావు, కార్యదర్శి సాంబమూర్తి, పిఇటిల అసోసియేషన్ తరపున పోలినాయుడు, కోచ్‌లు మాధురి, మణికంఠ, ఉమ, లక్ష్మణ్ పాల్గొన్నారు.


క్రీడాకారులతో కృష్ణదాస్

శిథిలావస్థలో సర్కారు భవనాలు

- భయాందోళనలో అధికారులు
- పట్టించుకోని పాలకులు, ఉన్నతాధికారులు

ప్రజాశక్తి- పలాస

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిపాలనలో భాగంగా ప్రజలకు సేవలు అందించేందుకు ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. అధికారులను నియమించారు. అందుకు చాలా ఏళ్ల క్రితం ప్రభుత్వ భవనాలు నిర్మించారు. కానీ, అక్కడితో పాలకులు అధికారులు చేతులు దులుపుకోవడంతో సర్కార్ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో తప్పని స్థితిలో విధులు నిర్వహించేందుకు అధికారులు భయాందోళనకు గురవుతున్నారు.

మండలంలోని మండల పరిషత్ కార్యాలయం సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో మండల ప్రజలతో పాటు అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల తిత్లీ తుపాను సమయంలో మండల సమావేశ మందిరం పైకప్పు ఎగిరి పోయింది. రూ.లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సీలింగ్ పూర్తిగా నాశనమైంది. చాలా ఏళ్ల క్రితం ఉన్న ఎంపిపి దళ్లి లక్ష్మి నూతన భవనం నిర్మించేందుకు మండల పరిషత్ కార్యాలయంలో కొంత స్థలాన్ని ఎల్ఐసి సంస్థకు అమ్మకం చేపట్టారు. అయితే ఆ నిధులతో నిర్మాణం చేస్తామని అనుకున్నారు. ఈ సమయంలో నిధులు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లిపోవడంతో భవన నిర్మాణ పనులకు నోచుకోలేదు. ప్రస్తుతం చిన్నపాటి వర్షం కురిస్తే కార్యాలయంలో చాలా ప్రాంతాల్లో కారిపోతుందని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. అలాగే వ్యవసాయ శాఖ కార్యాలయం పూర్తిగా శిథిలం కావడంతో అధికారులు భయపడుతున్నారు. ప్రస్తుతం భవనంలో వ్యవసాయశాఖ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. భవనం చాలా ఏళ్ల కితం నిర్మించడంతో ఎప్పుడూ ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. పలాస ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం, పంచాయతీరాజ్ డివిజన్ కార్యాలయాలు శిథిలావస్థలో ఉన్నాయి. ప్రస్తుతం పంచాయతీరాజ్ అధికారులు పక్కన ఉన్న డివిజన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండగా, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు కార్యాలయానికి సమీపంలో ఉన్న పాత ఇఇ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. పాత భవనాలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో శ్లాబ్‌పై పిచ్చి మొక్కలు బయటకు దర్శనమిస్తున్నాయి. శ్లాబ్ పెచ్చులు పడడంతో ఏ సమయంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళన చెందుతున్నారు. పాత భవనాలు సమయం మించిపోయినా, పాలకులు, అధికారులు నూతన భవనాలు మంజూరు చేయకపోవడంతో అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏదేమైనప్పటికీ ప్రజలకు సేవలు అందిస్తున్న అధికారులకు పక్కా భవనాలు నిర్మించడంలో పాలకులు, ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే చెప్పాలి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నత అధికారులు చొరవ చూపి పాడైన భవనాలకు మరమ్మతులు చేపట్టడమే కాకుండా నూతన భవనాలు మంజూరు చేయాలని మండల ప్రజలు, అధికారులు కోరుతున్నారు. ఇదే విషయంపై ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడుకు వివరణ కోరగా, భవనాలు శిథిలావస్థ చేరుకోవడం వాస్తవమని అన్నారు. నూతన భవనాలు మంజూరుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ప్రస్తుతం భవనాలు మంజూరు చేసిన వెంటనే పనులు చేపడతామన్నారు.


శిథిలావస్థలో మండల పరిషత్ కార్యాలయం


శిథిలావస్థలో వ్యవసాయశాఖ కార్యాలయం


శిథిలావస్థలో ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం



పుస్తకాలను పరిశీలిస్తున్న ఎపిఎం ప్రసాదరావు

గ్రామ సంఘాల పుస్తకాలు తనిఖీ

ఇచ్ఛాపురం : మండలంలోని గ్రామ సంఘాల్లో నిర్వహిస్తున్న లావాదేవీ పుస్తకాలను వెలుగు ఎపిఎం ప్రసాదరావు శనివారం తనిఖీ చేశారు. మండలంలోని 37 గ్రామ సంఘాల్లో జరుగుతున్న ఆర్థిక లావాదేవీలు, తీసుకున్న రుణాలు, చెల్లింపులు, ఖర్చులు, బ్యాంకు నిలువులపై వచ్చిన వడ్డీలు నమోదు సక్రమంగా నిర్వహిస్తున్నది, లేనిది పరిశీలించారు. ప్రతి గ్రామ సంఘం పుస్తకంలో తీర్మానాలను పరిశీలించారు. ఈ పరిశీలనలో వచ్చిన లోపాలను, లోతుపాట్లను తెలియజేసి చర్యలు తీసుకున్నారు. అకౌంట్ మోహిని, సిసిలు రామకృష్ణ, మోహనరావు పాల్గొన్నారు.

ఇఎస్‌ఐ డయాగ్నస్టిక్ సెంటర్‌ను ప్రారంభించాలి

ప్రజాశక్తి- రణస్థలం

పైడిభీమవరంలో నిర్మిస్తున్న ఇఎస్‌ఐ పది పడకల డయాగ్నస్టిక్ సెంటర్ నిర్మాణం పనులు సత్వరమే పూర్తి చేసి ప్రారంభించాలని, కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు పైడిభీమవరం ఇఎస్‌ఐ డిస్పెన్సరీ వద్ద శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల వైద్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. జిల్లాలో ఇఎస్‌ఐ పరిధిలో 30 వేల మంది కార్మికులు ఉన్నా... కనీసం సౌకర్యాలతో ఇఎస్‌ఐ ఆస్పత్రి లేదని అన్నారు. కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు అనారోగ్యం వస్తే విశాఖపట్నం ఆరిలోవలోని ఇఎస్‌ఐ ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోందన్నారు. సెలవు కోసం విజయనగరం వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇఎస్‌ఐ డిస్పెన్సరీల్లో అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో యునైటెడ్ బ్రేవరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐ.నారాయణరావు, జె.గంగరాజు, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ వర్కర్స్ యూనియన్ నాయుకులు బి.సురేష్, బి.రమేష్, కె.అచ్చెన్నాయుడు, అరబిందో ఫార్మా వర్కర్స్ యూనియన్ నాయుకులు రాంబాబు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు


ట్రాక్టర్, మృతదేహాన్ని బయటకు తీసుకున్న పోలీసులు

నేల బావిలో ట్రాక్టర్ బోల్తా డ్రైవర్ మృతి

ప్రజాశక్తి- పోలాకి

పొలం దుక్కి దున్నుతుండగా ట్రాక్టర్‌తో సహా నేల బావిలో పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని మగతపాడు పంచాయతీ అప్పారావుపేటలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బెలమర గ్రామానికి చెందిన పల్లి గోవిందరావు (35) అనే వ్యక్తి శుక్రవారం రాత్రి 8 గంటలు సమయంలో చింతాడ శ్రీనివాసరావు పొలంలో దుక్కి దున్నుతున్నాడు. దానికి సమీపంలో ఉన్న పొలంలో ఆణించి నేలబావి ఉంది. దుక్కు దున్నతుండగా నేలబావిని గమనించక గట్టు అని ట్రాక్టర్ ఎక్కించారు. వెంటనే ట్రాక్టర్‌తో సహా నేల బావిలో పడి పడిపోయాడు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో శనివారం తెల్లవారు జామున స్థానికులు చూసి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకోని క్రేన్ సహాయంతో ట్రాక్టర్‌ని, మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య పుణ్యవతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నర్సింహమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో భార్య, పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శంకరశర్మ

30న ఘంటశాల నాటిక ప్రదర్శన


ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అమర గాయకులు ఘంటశాల జీవితచరిత్ర నాటకాన్ని స్థానిక బాపూజీ కళామందిర్లో ఈ నెల 30న సాయంత్రం ఆరు గంటలకు ప్రదర్శించనున్నట్టు శ్రీసుమిత్రా కళాసమితి అధ్యక్షులు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు. నగరంలోని అవోపా కళ్యాణ మండపంలో పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన శ్రీసాయి సంతోషి నాట్య మండలి సురభి కళాకారులతో నిర్వహించనున్నట్టు వెల్లడించారు. భాస్కరుని సత్య జగదీష్ ఈ నాటకానికి రచన, దర్శకత్వం వహిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మండవిల్లి రవి, కోశాధికారి నక్క శంకరరావు, ఉప కోశాధికారి కొంక్యాన మురళీధర్, ఉపాధ్యక్షులు కిల్లాన ఫాల్గుణరావు, న్యాయ సలహాదారు డి.పార్థసారధి, వి.వి.ఆర్.మూర్తి, సభ్యులు మల్లెమొగ్గల రాజు, తిమ్మరాజు నీరజ, ఎం.కృష్ణ, పి.ఎ.ఎన్.శాస్త్రి, మెట్ట పోలినాయుడు పాల్గొన్నారు.


బాలికతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ తారకేశ్వర పండా

బాలికల ఉన్నత విద్యకు ప్రోత్సాహం

వజ్రపుకొత్తూరు : గ్రామీణ ప్రాంతాల్లోని బాలికలకు ఉన్నత విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని వజ్రపుకొత్తూరు బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తారకేశ్వర పండా అన్నారు. మండలంలోని నువ్వలరేవు, మంచినీళ్లపేట, హుకుంపేట గ్రామాల్లో బాలికల విద్య ఆవశ్యకతపై తల్లిదండ్రులకు శనివారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యాబోధన నిర్వహిస్తున్నామని అన్నారు. ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ కళాశాలలు బలోపేతానికి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్.ఎం.ఎస్.శ్రీధర్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు రమణమూర్తి, చినబాబు, తిరుపతిరావు, చక్రధర్, ఈశ్వర్, సురేష్, తారక, సిబ్బంది పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

'నీటి గింజల పంట' పుస్తకావిష్కరణ

శ్రీకాకుళం అర్బన్ : కవులకు కి పంచేంద్రియాలు పనిచేయాలని, అప్పుడే సమర్ధవంతమైన రచనలు పుట్టుకొస్తాయని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రచయిత కె.శివారెడ్డి అన్నారు. నగరంలోని హోటల్ గ్రాండ్‌లో నీటి గింజల పంట పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ మాట్లాడుతూ రైతుల కష్ట నష్టాలను నీటి గింజల పంట పుస్తకంలో రచయిత కంచరాన భుజంగరావు అద్భుతంగా ఆవిష్కరించారని కొనియాడారు. మంచి కవిత్వానికి ఎప్పుడూ ఆదరణ, కీర్తి ఉంటుందన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా నుంచి వచ్చిన రచయిత గంట్యాడ గౌరునాయుడు మాట్లాడుతూ కవులు ఉత్తరాంధ్ర సమస్యలపైన, సాహిత్యంపైన చర్చించడం ఎంతో అవసరమన్నారు. డిఇఒ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య మాట్లాడుతూ ఉపాధ్యాయులు రచనలు చేస్తూ మంచి స్ఫూర్తిని కలిగి ఉన్నారన్నారు. ప్రజలను చైతన్యపర్చడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలమన్నారు. గుంటూరు జిల్లా రచయిత, విమర్శకులు జి.లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ రచయిత భుజంగరావు రాసిన నీటి గింజల పంట పుస్తకంలో రైతుల ఆవేదనలు, అణచివేతకు గురవుతున్న రైతులు గురించి చక్కగా రాశారని అన్నారు. శ్రీకాకుళం రచయిత అట్టడ అప్పలనాయుడు, కొప్పల భానుమూర్తి మాట్లాడుతూ యువ రచయితలు కతవితం, కథలు సామాజిక అంశాలపై రాసి, నైతిక విలువలు పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో గజల్ వాసుదేవరావు, పక్కి రవీంద్ర, బమ్మిడి సుబ్బారావు, కారా సుబ్బారావు, దాసరి రామచంద్రరావు, దాసుబాబు, మల్లిపురి జగదీష్, పత్తి సుమతి పాల్గొన్నారు.

'ఉపాధి' హామీని కాపాడుకుందాం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఉపాధి హామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కోత విధించి నిర్వీర్యానికి కుట్ర పన్నుతుందని, దీనిని కూలీలందరూ పోరాటం చేసి కాపాడుకుందామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొల్లి ఎల్లయ్య పిలుపునిచ్చారు. మండలంలోని రావివలస ఉపాధి హామీ పనులను శనివారం పరిశీలించారు. జగ్గారావు చెరువు వద్ద సమావేశం నిర్వహించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధి హామీకి 2022లో రూ.అరవై తొమ్మిది వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తే... 2023లో బడ్జెట్‌లో రూ.అరవై వేల కోట్లు కేటాయించారని అన్నారు. ఇదీ అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పథకాన్ని కేంద్ర బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేయడానికి కుట్ర పన్నుతుందన్నారు. కూలీలు పోరాడి సాధించుకున్న ఉపాధి హామీని కేంద్ర ప్రభుత్వం అదాని, అంబానిలకు అప్పగించే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం రోజు కులీ రూ.600 ఇవ్వాలని, 200 రోజులు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో టెంట్లు, మెడికల్ కిట్లులు, తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. ఈ సమస్యలు పరిష్కరించకుంటే ప్రజా పోరాటాల ద్వారా సాధించుకుంటామని హెచ్చరించారు.


కూలీలతో మాట్లాడుతున్న ఎల్లయ్య

స్పీకర్‌కు సమస్యల మోత

ప్రజాశక్తి- ఆమదాలవలస

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంకు ప్రజల నుంచి సమస్యల మోత మోగింది. పురపాలక సంఘంలోని 20వ వార్డు పరిధిలోని వెంగళరావు కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సందర్భంగా ప్రజల నుంచి స్పీకర్‌కు సమస్యలపై పలు రకాల ఫిర్యాదులు అందాయి. గెడ్డాపు గన్నెమ్మ తనకు వృద్ధాప్య పింఛను అందడం లేదని ఫిర్యాదు చేశారు.. స్పీకర్ సచివాలయ సిబ్బందిని పిలిపించి పింఛను ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఆమె కూమార్తె లక్ష్మి పశుసంవర్ధక శాఖలో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తుండడంతో పింఛను రావడం లేదని సచివాలయ సిబ్బంది తెలిపారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తల్లిదండ్రులకు సంక్షేమ పథకాలు అందించమని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు ఇచ్చారని, వాటిని అమలు చేయాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉన్నదని స్పీకర్ పేర్కొన్నారు. విద్యా కమిటీ చైర్మన్ పందిరి రేణుక వీధి దీపాలు చాలా దూరంలో ఉండడంతో కుక్కలతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. వెంటనే చర్యలు చేపట్టాలని విద్యుత్ ఎఇని ఆదేశించారు. కుళాయిలకు మోటార్లు పెట్టడంతో తాగడానికి నీరు దొరకడం లేదని మహిళలు వాపోయారు. గతంలో నిర్వహించిన గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకొచ్చామని గుర్తు చేశారు. ఎన్నిసార్లు విన్నవించినా సమస్యకు పరిష్కారం దొరకడం లేదని నేలవేణి వాపోయింది. స్పీకర్ వెంటనే మున్సిపల్ ఎఇ అప్పలనాయుడును పిలిపించి మోటార్లను తొలగించి నీటి చౌర్యం చేస్తున్న వ్యక్తులపై కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బయటారి పావని టిడ్కో ఇంటి కోసం రూ.500 చెల్లించాలని, జాబితాలో మాత్రం తన పేరు రాలేదని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ ఎఇ వెంటనే కలుగజేసుకొని డబుల్ ఎంట్రీ వల్ల పెండింగ్‌లో ఉందని, త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని స్పీకర్‌కు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమేష్‌కుమార్, అజంతాకుమారి, దుంపల శ్యామ్, అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, బోర చిన్నంనాయుడు, పొడుగు శ్రీను, సాధు చిరంజీవి, బద్రి రామారావు, వ్యవసాయ అధికారి మెట్ట మోహనరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శిరీష పాల్గొన్నారు.


ఎఇతో మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

ఘనంగా అమరవీరుల సంస్మరణ సభ


పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సురేఖ పాణిగ్రాహి

ప్రజాశక్తి- పలాస

భూమి, భుక్తి, విముక్తి కోసమే ఎన్నో పోరాటాలు జరిగాయని విరసం అధ్యక్షుడు అరసవల్లి కృష్ణ అన్నారు. మండలంలోని బొడ్డపాడు అమరవీరుల భవనంలో ఘనంగా అమరవీరుల సంస్మరణ సభ శనివారం నిర్వహించారు. ముందుగా అమరుల పతాకాన్ని కీర్తిశేషులు సుబ్బారావు పాణిగ్రహి సహచరి సురేఖ పాణిగ్రహి ఆవిష్కరించారు. అమరుల బంధు మిత్రుల సంఘం నాయకులు జోగి కోదండం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీకాకుళం సాయుధ గిరిజన రైతాంగ పోరాటం దేశంలోనే ప్రాముఖ్యం సంతరించుకుందని పేర్కొన్నారు. ఈ పోరాటం ద్వారానే దేశంలో అనేక సంస్కరణలు వచ్చాయని చెప్పారు. ఆదివాసీలపై వైమానిక దాడులు నిలిపివేయాలని, ప్రస్తుత భారత రాష్ట్రపతితో పార్లమెంట్ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం దేశ సంపదను అదాని, అంబానిలకు కట్టబెట్టడానికి ప్రధాని మోదీ ప్రయత్నంలో భాగంగా ఆదివాసీలపై వైమానిక దాడులు చేయిస్తూ, గిరిజనులు పొట్టన పెట్టుకునే పాలన సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాసరి శ్రీరాములు మాట్లాడుతూ శ్రీకాకుళం అమరుల త్యాగంమే దేశంలో మావో ఇజానికి ప్రేరణ అని, దేశంలో ఆకలి, అంటరానితనం ఉన్నంతకాలం మావోయిజం సజీవంగా ఉంటుందన్నారు. సమావేశంలో తామడ త్రిలోచన, ప్రగతిశీల కార్మిక సంఘం నాయకులు పుచ్చా దుర్యోధన, శేషయ్య, మోహిని, ధనలక్ష్మి, లత, బొడ్డు సింహాద్రి, కారి పురుషోత్తం, గుణవంతు, ఎం.గణపతి, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పూజారులు గణేశ్వరరావు, కృష్ణమ్మ


అన్నపూర్ణేశ్వరిదేవి

నేటి నుంచి అన్నపూర్ణేశ్వరిదేవి సంబరాలు

ప్రజాశక్తి- మందస

మందసలోని అన్నపూర్ణేశ్వరిదేవి గ్రామ దేవత సంబరాలు ఆదివారం నుంచి జూన్ 6 వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని ఆలయ ప్రధాన అర్చకులు గోవింద్ కహల్య తెలిపారు. ఈ మేరకు శనివారం విలేకరులతో మాట్లాడారు. మందస, చుట్టు పక్కల తొమ్మిది గ్రామాలు ముస్తాబయ్యాయని అన్నారు. ఈ తొమ్మిది రోజులు పాటు రోజూ అన్నపూర్ణేశ్వరిదేవి అమ్మవారుని ఊరేగిస్తామని తెలిపారు. ఈ సంబరాలు మందస జమిందారీ కాలం నుంచీ ఐదేళ్లకోసారి నిర్వహిస్తున్నామని చెప్పారు. అలాగే గ్రామ దేవత పూజారులు గణేశ్వరరావు, కృష్ణమ్మ దంపతులు మాట్లాడుతూ 1972 నుంచి తమ తాతతండ్రుల నుంచి ఇప్పటివరకు సంబరాలకు పూజారులుగా చేస్తున్నామని చెప్పారు. తమ ఇంటి నుంచి ఈ సంబరాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. గ్రామ పెద్దలు, ప్రజలు ఐకమత్యంతో పండగలు చేసుకుంటారని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న సంబరాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తొలి రోజు 28వ తేదీన సాయంత్రం ఐదు నుంచి ఎనిమిది గంటల వరకు కళా ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సకాలంలో జెవికె కిట్లు పంపిణీ

పొందూరు: జూన్ 12వ తేదీ పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు జెవికె కిట్లు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని సమగ్ర శిక్షా అభియాన్ ఎఎంఒ సిహెచ్.సుధాకరరావు, ఎఎల్ఎస్ కో-ఆర్డినేటర్ పూడి తిరుపతిరావు పేర్కొన్నారు. పొందూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జెవికె స్టాక్ పాయింట్‌ను శనివారం పరిశీలించారు. వీరితోపాటు ఎంఇఒ పి.వి.రామరాజు, స్టాక్ పాయింట్ ఇన్‌ఛార్జి పద్మావతి ఉన్నారు.


జెవికె కిట్లను పరిశీలిస్తున్న అధికారులు

జీడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి- పలాస

జీడి ప్రధాన పంటగా బతుకుతున్న రైతాంగాన్ని ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు బి.వాసుదేవరావు, బి.ఆనందరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కాశీబుగ్గలో శనివారం విలేకరులతో మాట్లాడారు. జీడి పిక్కలు బస్తా ధర గతం కంటే దారుణంగా పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రేక్షక పాత్ర వహించడం దారుణమన్నారు. రైతు ప్రభుత్వమని ప్రకటనలు చేయడం తప్ప నిజంగా రైతులకు న్యాయం జరగడం లేదని అన్నారు. 80 కేజీల పిక్కల నుంచి జీడి పప్పు సగటున 23 కేజీలు వస్తుందని, లోకల్ మార్కెట్‌లో అమ్మితే రూ.19,500, అదే ఎగుమతి చేస్తే రూ.23 వేలు వస్తుందని అన్నారు. రైతులను నిలువునా దోపిడీ చేస్తుంటే... ప్రభుత్వం ఏమి చేస్తుందని ప్రశ్నించారు. ఇదేనా రైతు ప్రభుత్వమని ఎద్దేవ చేశారు. తిత్లీ అదనపు నష్టపరిహారం కొద్దిమందికే వర్తించిందని అన్నారు. ప్రభుత్వ వైఖరిని జీడి రైతులు గమనిస్తున్నారని, సరైన సమయంలో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కిసాన్ మహాసభ నాయకులు అప్పయ్య, పాపయ్య, నేతాజీ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

'మహానాడు'లో జిల్లా టిడిపి నాయకులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్న మహానాడులో ఇచ్ఛాపురానికి చెందిన టిడిపి నాయకులు ఉత్సహంగా పాల్గొన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ శత జయంత్యుత్సవాలు, మహానాడు కార్యక్రమాల్లో పాల్గొవానికి ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో కాళ్ల దిలీప్‌కుమార్, పత్రి తవిటయ్య, సాలిన్ ఢిల్లీరావు, బత్తిని కృష్ణయ్య, బోరుభద్ర లోహిదాసు పాల్గొన్నారు.

పాతపట్నం : రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్న మహానాడులో తొలి రోజు టిడిపి నాయకులు, సామాజికవేత్త మామిడి గోవిందరావు పాల్గొన్నారు. ఈ మేకు ఈ వేదికపై టిడిపి ప్రధాన కార్యదర్శి లోకేష్‌తో మాటామంతి ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఆమదాలవలస : రాజమహేంద్రవరంలో తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమంలో మండలానికి చెందిన టిడిపి నాయకులు నేతలు మొదటి రోజు హుషారుగా పాల్గొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు నూకరాజు మాట్లాడుతూ టిడిపికి మహానాడు ఒక పండగ వంటిదని, నాయకుల్లో, కార్యకర్తల్లో ఉత్సాహం వెల్లి విరుస్తుందని అన్నారు. జిల్లా కార్యాలయ కార్యదర్శి సనపల ఢిల్లేశ్వరరావు మాట్లాడుతూ మహానాడు ప్రాంగణంలో కార్యకర్తలు అడుగు పెట్టేసరికి ఏదో తెలియని అనుభూతి కలుగుతుందన్నారు. చంద్రబాబు నాయుడు ప్రసంగం నాయకులను, కార్యకర్తలను, యువతను ఉత్తేజపరిచిందన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ తమ్మినేని విద్యాసాగర్, తమ్మినేని చంద్రశేఖర్, హనుమంతు బాలకృష్ణ, గుజ్జల లక్ష్మణరావు, పాతిన రమణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్న మహానాడులో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ పాల్గొన్నారు. ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాల్లో నారా లోకేష్, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

పలాస : రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్న మహానాడులో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పాల్గొన్నారు. టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు అభివాదం చేశారు.


పలాస : లోకేష్‌కు అభివాదం చేస్తున్న గౌతు శిరీష


ఆమదాలవలస : మహానాడులో పాల్గొన్న నాయకులు


పాతపట్నం : లోకేష్‌తో మాట్లాడుతున్న ఎంజిఆర్


కొత్తూరు : లోకేష్‌తో మాట్లాడుతున్న వెంకటరమణ


సన్మానిస్తున్న స్పీకర్ సీతారాం

వాలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- బూర్జ

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన గ్రామ సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కొల్లివలస బాలయోగి గురుకుల పాఠశాలలో శనివారం నిర్వహించిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తమ సేవలందించిన వాలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర మూడు కేటగిరీల్లో ప్రభుత్వం వరుసగా మూడో ఏటా సత్కరించిందని అన్నారు. వివక్ష, అవినీతికి తావులేకుండా వాలంటీర్ల వ్యవస్థ పనిచేయాలని సూచించారు. తమ పరిధిలోని కుటుంబాలకు చేదోడు వాదోడుగా నిలిచి ప్రజల మన్ననలను పొందాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందివ్వాలన్నారు. ఇంటింటా సర్వే, పింఛన్ల పంపిణీ, యాప్‌ల వినియోగం, నవరత్నాలు అమలులో భాగస్వామ్యం, రేషన్ డోర్ డెలివరీ, ఆరోగ్యశ్రీ కార్డు, రేషన్ కార్డుల మంజూరులో వాలంటీర్ల సేవలు అభినందనీయమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పురస్కారాలతో వాలంటీర్లు స్ఫూర్తిగా పనిచేయాలని సూచించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా వాలంటీర్లు పనిచేస్తున్నారని అన్నారు. అనంతరం ఉత్తమ సేవలందించిన వాలంటీర్లను సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగు, ఎంపిపి ప్రతినిధి కర్నేన నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి బి.రామారావు, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపిపిలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, బిఎసిఎస్ అధ్యక్షులు ఎం.నారాయణమూర్తి, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు గుమ్మడి రాంబాబు, మండల కార్యదర్శి ఇసాయి వెంకట్రావు పాల్గొన్నారు.


అపరాధ రుసుము విధిస్తున్న అధికారులు

ఆర్‌సిటి దుకాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ఆర్‌టిసి బస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న దుకాణాల్లో జిల్లా టోభాకో కంట్రోల్ సెల్ అధికారులు శనివారం తనిఖీలు చేపట్టారు. పోలీస్ యంత్రాంగం, ఆర్‌టిసి సిబ్బంది, ప్రభుత్వ లైవ్ డిపార్ట్‌మెంట్ సహకారంతో పొగాకు ఉత్పత్తుల నియంత్రణపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. అలాగే పొగాకు వినియోగిస్తున్న వారికి అవగాహన కల్పించారు. బహిరంగ ధూమపానం చేసే వారికి చట్టంపై అవగాహన కల్పించారు. సిగరెట్ తాగిన వారిపైన, విక్రయదారులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం సిగరెట్లు అమ్మకందారులకు అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, రవిప్రసాద్, సురేష్ పాల్గొన్నారు.

సిఎంను కలిసిన యోగి

శ్రీకాకుళం అర్బన్ : గిరిజన ప్రాంతాల్లో ఐటిడిఎ ద్వారా నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలల్లో నాలుగో తరగతి ఉద్యోగాలను భర్తీ చేయాలని ఆదివాసీ వికాస పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి కోరారు. ఢిల్లీ విమానాశ్రయంలో శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠశాలల పునఃప్రారంభంలోగా నియామకాలు పూర్తి చేయాలని కోరారు.


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అన్వేష్

కమ్యూనిటీ భవనం మంజూరు చేయాలి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో క్రిస్టియన్ల సమావేశాలకు, శుభకార్యాలకు అవసరమైన కమ్యూనిటీ భవనం మంజూరు చేయాలని క్రిష్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఇదే విషయంపై క్రిష్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బోల్ల వరపుజాన్‌వెస్లీకి వినతిపత్రం అందజేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ... ఇచ్ఛాపురంలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి కావాల్సిన స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారని తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలో షిప్ ప్రతినిధుల బృందం పాల్గొన్నారు.

నేటి నుంచి కాళీమాత ఉత్సవాలు

వజ్రపుకొత్తూరు : మండలంలోని పెద్దబొడ్డపాడులో ఉన్న కాళీమాత గ్రామదేవత ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమవుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు, కాళీమాత యువజన సంఘం సభ్యులు తెలిపారు. 2010 తరువాత ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించడానికి కమిటీ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

రమాభాయి అంబేద్కర్ త్యాగమూర్తి

శ్రీకాకుళం అర్బన్ : దేశంలో బహుజనుల హక్కుల పరిరక్షణకు, నలుగురు పిల్లలను కోల్పోయిన గొప్ప త్యాగమూర్తి మాతా రమాభాయి అంబేద్కర్ అని బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు పిట్ట చంద్రపతిరావు అన్నారు. నగరంలోని జ్యోతిరావు పూలే పార్కులో బిసి, బహుజన, దళిత సంఘాల ఆధ్వర్యాన రమాభాయి అంబేద్కర్ 88వ వర్ధంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముందుగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో అంబేద్కర్ మానవ హక్కుల కోసం చేసిన ప్రతి పోరాటంలోనూ ఆమె అండగా నిలిచారని గుర్తు చేశారు. కార్యక్రమంలో దళిత, బహుజన సంఘాల నాయకులు తైక్వాండో శ్రీను, డాక్టర్ కంఠ వేణు, బహుజన నాయకులు గుత్తు చిన్నారావు, రాజు మోహనరావు, యజ్జల గురుమూర్తి, పెయ్యల చంటి పాల్గొన్నారు.

పిఒను కలిసిన ఉపాధ్యాయులు

సీతంపేట: గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఐటిడిఎ పిఒ కల్పనా కుమారికి శనివారం తన చాంబర్లో యుటిఎఫ్ ఆధ్వర్యంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి. రమేష్, ఎస్. మురళి మోహన్, రాములు విన్నవించారు. ఈ సందర్భంగా ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలు తెలియజేశారు. గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల బదిలీలు నిబంధనలను సవరించాలని దీని కోసం ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేయాలని కోరారు. మహిళ ఉపాధ్యాయులు ఏ పాఠశాలలోనైనా పనిచేసే విధంగా నిబంధనలు సవరణ చేయాలని కోరారు.

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రోడ్డు ప్రమాద ఘటనలతో పాటు గుండె పోటు వచ్చినప్పుడు క్షతగాత్రులను ఆస్పత్రికి చేర్చేలోగా ప్రథమ చికిత్స అందించాల్సి ఉంటుందని, అటువంటి సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న ప్రజలకు అవగాహన ఉండాలని ట్రాఫిక్ డిఎస్‌పి సిహెచ్.జి.వి.ప్రసాదరావు అన్నారు. నగరంలోని డేఅండ్‌నైట్ కూడలి వద్ద మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యాన ఎమర్జెన్సీ మెడిషన్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యవసర వైద్య సాయం అందించేందుకు వైద్య సిబ్బందితో పాటు ప్రజల్లో అవగాహన ఉంటే సకాలంలో వైద్యం అందించి ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించేందుకు వీలువుతుందన్నారు. మారుతున్న కాలంలో అనేక వ్యాధులు సంభవిస్తూ హఠాత్తుగా మరణాలు సంభవిస్తున్నాయని, ఈ మరణాలను నియంత్రించడానికి సకాలంలో వైద్యం అందించాలన్న ఆలోచన రావాలని అన్నారు. గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ ద్వారా హఠాత్తు మరణాలు సంభవిస్తున్నాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో హెడ్‌ఆఫ్ ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన బాల సూర్యప్రకాష్, సెంటర్ హెడ్ సాగరిక, ట్రాఫిక్ ఎస్‌ఐలు వెంకటేష్. సోమశేఖర్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డిఎస్‌పి ప్రసాదరావు

ఇళ్ల లబ్ధిదారులకు రుణాలు ఇప్పించాలి


సమీక్షిస్తున్న ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

డ్వాక్రా సంఘాల్లోని సభ్యులు జగనన్న ఇళ్ల నిర్మిస్తున్న లబ్ధిదారులకు పెట్టుబడి కోసం రూ.35 వేలు రుణాలు ఇప్పించాలని వైఎస్‌ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ పైడి కూర్మారావు సూచించారు. పట్టణంలోని మండల మహిళా సమాఖ్యలో సిబ్బందితో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతానికి కృషి చేయాలన్నారు. ఇప్పించిన అన్ని రుణాలను గ్రామ సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్ లాగిన్‌లో అప్‌డేట్ చేయించాలన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అకౌంటెంట్ కళ్యాణి, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు సుభద్ర, చంద్రరావు, రమణ, రామప్పుడు పాల్గొన్నారు.

నెహ్రూకు నివాళి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

భారతదేశ మొదటి ప్రధానమంత్రి, భారతరత్న పండిట్ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఎచ్చెర్ల నియోజకవర్గం ఇన్‌ఛార్జి బిసి సెల్ రాష్ట్ర కన్వీనర్ కొత్తకోట్ల సింహాద్రినాయుడు ఆధ్వర్యాన నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత ప్రధానిగా ఎంతో ముందు చూపుతో పాలన సాగించారని అన్నారు. కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ కె.లక్ష్మి, కె.జోగినాయుడు, ఎ.జగదీష్‌నాయుడు, వై.సూర్యనారాయణ, ఎం.గణేష్, రాజు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు


బాలకృష్ణదాస్‌ను సన్మానిస్తున్న సంఘ నాయకులు

ముగిసిన శిక్షణా తరగతులు

సోంపేట: మండలంలోని మామిడిపల్లిలో స్థానిక మహాత్మ యువజన సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న బెనారస్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ బాలకృష్ణదాస్ మాట్లాడుతూ నైతిక విలువలు కనుమరుగవుతున్న ప్రస్తుత తరుణంలో ఇటువంటి శిక్షణా తరగతులు ఎంతో అవసరమన్నారు. అందుకు కృషి చేసిన మహాత్మ యువజన సంఘం కృషిని అభినందించారు. అనంతరం బాలకృష్ణదాస్‌ను సంఘ ప్రతినిధులు బొడ్డు సింహాచలం దుశ్శాలువ కప్పి సనఆమనించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాతిన శేషగిరి, గ్రామ పెద్దలు పాతని కృష్ణమూర్తి, జి.కామరాజు, ఎం.లోకనాథం, జి.నాగేశ్వరరావు, బోడ్డు కోదండరావ్, షణ్ముఖరావు, శ్రీరామ్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని వినతి

ఇచ్ఛాపురం : పురపాలక సంఘం పరిధిలోని 22 వార్డు బలరాంపేటలో ఏర్పాటు చేసిన వంద కెవి ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక లోడు పడడంతో విద్యుత్ పరికరాలు, టివిలు, ఫ్రిజ్‌లు కాలిపోతున్నాయని కాళ్ల మనోజ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఎఇ గోవిందరావును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో ట్రాన్స్‌ఫార్మంలో మంటలు చెలరేగి, పొగలు వచ్చాయని అన్నారు. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని అన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, తిరుపతి, రంగ, యువకులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్'పై అవగాహన కల్పించాలి

కొత్తూరు : కొత్తూరులో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను ప్రజలకు అవగాహన కల్పించాలని పాతపట్నం వైసిపి నియోజకవర్గ నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు సూచించారు. ప్రజల నుంచి పలు ఫిర్యాదులు రావడంతో స్థానిక ఆస్పత్రిలోని వైద్యులను, ఎఎన్‌ఎంలను శనివారం అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగులకు సరైన వైద్యం అందించాలని సూచించారు. ఈయన వెంట మెట్టూరు బిట్-1 సర్పంచ్ ఎ.వంకరరావు, కొయిలాపు సంజీవరావు, తిరుపతిరావు ఉన్నారు.


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న తులసీవరప్రసాదరావు